ఎల్‌కేఫారంలో అట్రాసిటీ కేసుపై విచారణ

నవతెలంగాణ-నవీపేట్

నవీపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్కే ఫారంలో ఏసిపి కిరణ్ కుమార్ ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుపై సోమవారం విచారణ చేపట్టారు. ఉగాది పురస్కరించుకొని తరిగొప్పల రామకృష్ణ, గౌతమ్‌లు రామాలయం వద్ద ఉగాది, శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీ పెట్టగా సర్పంచ్ భర్త దొంత ప్రవీణ్ కుమార్‌ల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్న విషయం విధితమే. కాగా రామకృష్ణ, గౌతములపై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు కాగా.. ఫిర్యాదిదారు క్రైస్తవుడని తప్పుడు కేసు నమోదు చేశారని జిల్లా వ్యాప్తంగా పలువురు కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయగా సంచలనంగా మారిన సంగతి విధితమే. ఏసీపీ ఘటన స్థలానికి వెళ్లి ఫ్లెక్సీ పెట్టిన స్థలాన్ని పరిశీలించారు. ఫిర్యాది దారుడు దొంత ప్రవీణ్ ఆరోపించిన విధంగా ఫ్లెక్సీ శిలాఫలకాలకు అడ్డుగా ఉందా అనే విషయమై ప్రశ్నించారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వచ్చి రికార్డులు, కేసుల వివరాలను పరిశీలించారు. ఆయన వెంట సిఐ నరహరి, ఎస్సై రాజారెడ్డి అన్నారు.

అనుదినం జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

మంగళవారం 11 ఏప్రిల్ 2023

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-కోటగిరి

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి విఠల్‌గౌడ్ అన్నారు. సోమవారం కోటగిరిలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. వ్యవసాయ కార్మికులకు కోసం ప్రత్యేక చట్టం చేయాలని, వరి కోతలు ప్రారంభం కావడంతో వడ్ల కుప్పలు రోడ్లపై ఉన్నాయని, అకాల వర్షాలతో నష్టం వాటిల్లేకంటే ముందే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు నల్లగంగాధర్ మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు రోజువారిగా రూ. 600 పెంచాలని, సంవత్సరానికి పనిదినాలు 200ల రోజులు కల్పించాలని కూలీలకు పెండింగ్ ఉన్న ఉపాధి బిల్లును వెంటనే చెల్లించాలని, ఉపాధి కూలీలకు టెంట్లు, నీటి సౌకర్యం, మెడికల్ కిట్టు కల్పించాలని, 50 సంవత్సరాలు నిండిన వ్యవసాయ కార్మికులకు రూ.5000 పెన్షన్ ఇవ్వాలని, ఉపాధిహామీన్ని మున్సిపాలిటీలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక నాయకులు గంపల హనుమాండ్లు, జి.గంగారాం, డి.సాయిలు, జి.లక్ష్మి, అంజవ్వ, గైని రాములు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఏకోపాధ్యాయ.. ఎప్పుడొస్తారో

- మారుమూల మండలంలో పర్యవేక్షణ కరువు
- సోనాలలో టీచర్ కోసం ఎదురుచూసిన విద్యార్థులు
- విచారణ చేపడతాం : ఎంఈవో



నవతెలంగాణ-మద్నూర్

మారుమూల మద్నూర్ మండలంలోని స్కూళ్లల్లో ఉపాధ్యాయుల పనితీరును పట్టించు కునే నాథుడే కరువైయ్యాడని మండల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలువురు ఉపాధ్యాయులు ఎప్పుడొ స్తారో ఎప్పుడు వెళ్తారో తెలియదని, విద్యార్థుల బంగారు భవిష్యత్తు ఆగమ్యగోచరంగా మారుతోందని వాపోతు న్నారు. ఎంఈవోలు పర్యవేక్షిం చాల్సి ఉండగా.. వారికి మూడు నాలుగు మండలాలకు ఇన్‌చార్జీలుగా అదనపు బాధ్యతలు అప్పగించడంతో వారు ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో ఉపాధ్యా యులపై సరైన పర్యవేక్షణ లేక విద్యార్థులకు నష్టం వాటిల్లుతోంది.

మద్నూర్ మండలంలోని సోనాలలో ఏకోపాధ్యాయ పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయులు విధులకు రాకపోవడంతో విద్యార్థులు వచ్చి పడిగాపులు కాసి తిరిగి వెళ్లిపోయారు. దీంతో ఖాళీగా ఉన్న కుర్చీని గ్రామస్తులు ఫొటోలు దించి షేర్ చేశారు. వరుసగా మూడు రోజుల సెలవుల అనంతరం సోమవారం స్కూళు తెరుచుకోగా.. టీచర్ గైర్హాజరు కావడంతో విద్యార్థులకు పాఠాలు బోధించే వారే కరువైయ్యారు. ఉపాధ్యాయుల గైర్హాజరు ఒక్క సోనాల గ్రామానికే పరిమితం కాదని, మండలంలోని పలు గ్రామాల్లో పలు వురు ఉపాధ్యాయులు ఇష్టారీతిన విధులు నిర్వర్తిస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవు తున్నాయి. ఎంఈవో పర్యవేక్షణ లేకపోవడం, ఆకస్మిక తనిఖీలు చేపట్టకపో వడంతో పలువురు ఇష్టారాజ్యంగా విధులు చేపడుతున్నారని, విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఉన్నతాధికారులు పర్యవేక్షణ పెంచాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఈ విషయమై ఎంఈవో రాములను నవతెలంగాణ వివరణ కోరగా.. టీచర్ గైర్హాజరుపై విచారణ చేపడతామని, సదరు టీచర్‌కు మెమో జారీ చేస్తామని తెలిపారు.

బీజేపీ ఆగడాలపై

కలిసొచ్చే పార్టీలతో ఉద్యమాలు

- సీపీఐ, సీపీఐ(ఎం)



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ, సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

బీజేపీ ఆగడాలను అడ్డుకునేందుకు కలిసొచ్చే పార్టీలతో కలిసి ఉద్యమాలు నిర్వహించనున్నట్టు సీపీఐ, సీపీఐ(ఎం) నాయకులు ప్రకటించారు. సోమవారం నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఇరు పార్టీలు కలిసి ఉమ్మడిగా ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ మీడియా సమావేశం ఉద్దేశించే సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ.రమేష్ బాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన సమ్మేళనానికి హాజరై జయప్రదం చేసినందుకు ఇరు పార్టీల శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్నటువంటి బిజెపి.. ప్రభుత్వ రంగ సంస్థలని చౌకగా ప్రైవేటు వారికి దారదత్తం చేస్తున్నదని తెలిపారు. ఇప్పటికే కార్పొరేట్ సంస్థలకు 10 లక్షల కోట్ల బ్యాంక్ లోన్లను మాఫీ చేసిందని అన్నారు. ప్రధాని మోడీ ఒకే దేశం ఒకే పన్ను నినాదంతో జీఎస్టీ తీసుకొచ్చి నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించలేక పోయారని అన్నారు.

ఒకే దేశం ఒకే పన్ను అనే బిజెపి, ఒకే దేశం ఒకే కులం అని ఎందుకు అనడం లేదని, కేంద్ర నాయకత్వం బిజెపిని ప్రశ్నించారని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరీక్షా పత్రాల లీకేజీలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, నిజామాబాద్ ఎంపీగా ఉన్న అరవింద్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారంగా పసుపు బోర్డు తెచ్చేంత వరకు నిజామాబాద్ లో తిరిగే హక్కు లేదని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ, సిపిఎం తో పాటు కమ్యూనిస్టు పార్టీలు, బిజెపీయేతర పార్టీలతో కలిసి ఉద్యమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. ప్రెస్‌మీట్‌లో సీపీఐ జిల్లా నాయకులు వై.ఓమయ్య, ఏ.రాజేశ్వర్, సాయిలు, సీపీఐ(ఎం) నాయకులు ముజీబ్, హైమద్ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ధర్నాకు సీఐటీయూ మద్దతు



ధర్నా చేపట్టిన రిటైర్డ్ ఉద్యోగులు.. మద్దతు తెలిపిన సీఐటీయూ

నవతెలంగాణ కామారెడ్డి టౌన్

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. వీరి ఆందోళనలకు సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, నాయకులు రాజనర్సు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులకు ప్రతినెల 1వ తేదీ లోపల వారి పింఛను వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, క్యాష్ లెస్ ట్రీట్‌మెంట్ అన్ని కార్పోరేట్ ఆస్పత్రుల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐటీ నుంచి మినహాయించి పెండింగ్ బకాయిలు చెల్లించాలని, ఉపాధ్యాయులకు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశార. కార్యక్రమంలో కర్రల సత్యం తదితరులు పాల్గొన్నారు.

చెక్‌డ్యాం నిండా నీరు



చెక్‌డ్యాం నీటిని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిదులు, నాయకులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని కన్నాపూర్ గ్రామ పరిసరాల్లో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన చెక్ డ్యామ్ లో నీరు నిండి అలుగు పారడంతో సోమవారం ఎంపీపీ దశరథ్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులతో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మిషన్ కాకతీయ, చెక్ డ్యాముల నిర్మాణంతో, కురుస్తున్న వర్షాలకు నీటి నిలువ పెరిగి, భూగర్భ జలాలు పెరగడంతో, రైతులు పండించే పంటలకు సమృద్ధిగా నీరు అందుతుందని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రవీందర్రావు, సర్పంచ్ రాజనర్సు, నాయకులు మహేష్, నవీన్, కిషన్, లింగం, చంద్రం ఉన్నారు.

విప్ ఇంటి ముట్టడికి యత్నం



విప్ ఇంటి ముట్టడికి యత్నిస్తున్న ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

టిఎస్పిఎస్సి ప్రశ్నా పత్రాల లీకేజీ పై వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని ఎన్ఎస్ యూఐ ఆధ్వర్యంలో పట్టణంలోని విప్ గంపగోవర్ధన్ ఇంటిము ట్టడికి సోమవారం నాయ కులు యత్నించారు. దీంతో పోలీసులు అడ్డుకొని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్, ఎన్ఎస్‌యుఐ పట్టణ అధ్యక్షుడు భరత్ టింకు మాట్లాడుతూ.. లక్షలాదిమంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నాపత్రాల లీకేజీతో నిర్వీర్యం అయిపోయిందని గత 15 రోజులుగా ప్రశ్నాపత్రాల లీకేజీ విషయంలో సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని ఆందోళనలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఇప్పటివరకు స్థానిక ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఈ విషయంలో కనీస స్పందన సైతం తెలియజేయ లేదని అన్నారు. వారం రోజుల్లో ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోకపోతే సీఎం క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్,ప్రవీణ్, సురేష్, నందు, ప్రశాంత్, సోఫియాన్, వంశీ, ప్రదీప్ నిఖిల్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాల్లో తరుగుతీయొద్దు

- కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే షకీల్



కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ధాన్యం తూక వేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-బోధన్

రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే సమయంలో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తరుగు పేరిట రైతులను మోసం చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ అన్నారు. సోమవారం బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం రైతులు ప్రతి సంవత్సరం రెండు పంటలు పండించుకునేలా పుష్కలంగా సాగునీరు, రైతు పెట్టుబడి ఇస్తూ ఆదుకుంటుందని తెలిపారు. అంతేకాకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ నిరుపేదల పెళ్లికి లక్ష నూటపదహారు రూపాయలు అందించి ఆర్థికంగా ఇబ్బందులు లేకుండా చేస్తున్నారని అన్నారు. పొరుగున ఉన్న మహారాష్ట్రలో రహదారులు సక్రమంగా లేక, రైతుబంధు, రైతు పెట్టుబడులు లేకుండా పాలన అస్తవ్యస్తం ఉండడంతో ప్రజలు ఎంత బాధపడుతున్నారో తానే పరిశీలించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలని మహారాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు.

నియోజకవర్గంలో సన్ ఫ్లవర్ రైతులకు సీఎం కేసీఆర్ తో మాట్లాడి 25 కోట్ల రూపాయల లాభం చేకూర్చేలా చేసినట్టు తెలిపారు. తక్షణమే సొసైటీలు, ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ఆదేశించారు. అనంతరం ఏఎంసీలో ఏర్పాటుచేసిన చలివేంద్రం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఏఎంసీ డైరెక్టర్లు, సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రాజేశ్వర్, తహశీల్దార్ వరప్రసాద్, ఏఎంసీ చైర్మెన్ వీఆర్ దేశాయి, వైస్ చైర్మెన్ షకీల్, జడ్పీ వైస్ చైర్మెన్ రజిత, ఎంపీపీలు బుద్దె సావిత్రి, శ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్లు గంగారెడ్డి, శరత్, వైస్ ఎంపీపీ గంగారెడ్డి నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గానికో ఆరుబస్సులు

- హైదరాబాద్‌లో అంబేద్కర్ విగ్రహావిష్కరణపై కలెక్టర్ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

ఈనెల 14న అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని హైదరాబాదులో అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం, సమావేశం ఉంటుందని కలెక్టర జితేశ్ వి పాటిల్ తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి ఆరు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని సూచించారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో సోమవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఈనెల 14న హైదరాబాదులో అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం, సమావేశం ఉందని తెలిపారు. మండలాల వారిగా బస్సులను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ సమావేశానికి వచ్చే వారికి తాగునీరు, భోజన సదుపాయం కల్పించాలని సూచించారు. సమావేశంలో ఎస్పీ శ్రీనివాసరెడ్డి, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, డి ఆర్ డిఓ సాయన్న, జెడ్పీ సీఈవో సాయగౌడ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, ఆర్డీవో వాణి, ఆర్టీసీ డిఎం మల్లేశం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ

కామారెడ్డి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) , లయోలా హైస్కూల్‌లోని 10వ తరగతి పరీక్ష కేంద్రాలను సోమవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తనిఖీ చేశారు. పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలని అధికారు లకు సూచించారు. పరీక్ష కేంద్రాల్లోని వసతులను పరిశీలించారు. పరీక్షకు హాజరైన విద్యార్థుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలను సజావుగా నిర్వహించాలని పేర్కొన్నారు.

ఆరుబయట అంత్యక్రియలే

సేవా కార్యక్రమాలకు పునాది

- వెల్లడించిన రిటైర్డ్ టీచర్ గుర్రాల సరోజనమ్మ
- ఆర్డీవోతో కలిసి ధర్మస్థల భవనం ప్రారంభోత్సవం



ధర్మస్థల భవనాన్ని ప్రారంభిస్తున్న సరోజనమ్మ, ఆర్డీవో రాజేశ్వర్

నవతెలంగాణ-బోధన్

కొంతమంది నిరుపేదలు కిరాయి ఇండ్లలో ఉండేవారు చనిపోయినప్పుడు ఆ ఇండ్లలో ఇంటి యజమాని అంత్యక్రియలు జరగకుండా అడ్డుకున్నప్పుడు దాంతో చెట్ల కింద ఉండి అంత్యక్రియలు చేసిన ఘటనలు చూసినప్పుడు తాను చలించిపోయానని, ఇలాంటి ఘటనలు తన బంధువులకు కూడా జరిగాయని ఈ సంఘటనలు బాధాకరమని ఇలాంటివి జరగకుండా ఉండడానికి ఏదో చేయాలనే తపనతో తాను ధర్మస్థలం భవనాన్ని నిర్మాణం చేపట్టినట్టు రిటైర్డ్ టీచర్ గుర్రాల సరోజనమ్మ తెలిపారు. బోధన్ పట్టణంలోని చెక్కి చెరువు వద్ద ఆమె నిర్మించిన ధర్మస్థల భవనాన్ని ఆర్డీవో రాజేశ్వర్ సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మనిషి చివరి ఘడియలు ఎవరు ఇబ్బందికర పరిస్థితుల్లో అంత్యక్రియలు జరగరాదనే భావనతో ఈ ధర్మస్థలం నిర్మించానని దీనిని కిరాయి ఇండ్లలోని వారు, నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అనంతరం ఆర్డిఓ రాజేశ్వర్ మాట్లాడుతూ మహెూన్నత మానవతావాది గుర్రాల సరోజనమ్మ అని కొనియాడారు. తన సొంత ఆస్తులు సమాజానికి ధారాదత్తం చేయడం, పెన్షన్ డబ్బులు సైతం సేవా కార్యక్రమాలకు వినియోగించడం ఆమె ఉన్నత ఆలోచనలకు నిదర్శనమని అన్నారు.

అనంతరం ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రామ్మోహన్ రావు మాట్లా డుతూ ఆల్ పెన్షన్స్ ఆల్ పెన్షనర్స్ బోధన్ డివిజన్ గౌరవ అధ్యక్షురాలు గుర్రాల సరోజనమ్మ తన సొంత డబ్బులతో ధర్మస్థలం నిర్మించడం వర్ణించలేని సేవా గుణ మని కొనియాడారు. నిరుపేద లు కిరాయి ఇండ్లలో ఉన్న వారికి ఇది ఎంతో ఉపయోగక రంగా ఉంటుందని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రభుత్వమే పట్టణాలు, నగరాలలో చేయవలసి ఉంటుంది కానీ ఒక ఉదారమైన స్వభావంతో సేవ చేయాలని భావనతో గుర్రెల సరోజనమ్మ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయ మన్నారు. నిజామాబాద్‌లో ఏర్పాటు చేసిన మల్లు స్వరాజ్యం ట్రస్ట్‌కు ఆల్మస్ పెట్టమని రెండు లక్షలు ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. ఆమె అందరికీ ఆదర్శనీయు రాలని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తూము పద్మావతి, కౌన్సిలర్ దాము, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



సరోజనమ్మను సన్మానిస్తున్న ఆర్డీవో

ధాన్యం ఆరబెట్టేందుకు రైతుకు రహదారే దిక్కు

- రోడ్లపైనే ధాన్యం ఆరబోత
- ప్రయాణికులకు తప్పని ప్రాణహాని
- కాలం చెల్లిన కల్లాల పథకం
- సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో రైతులపై కేసులు
- ప్రత్యామ్నాయం చూపని యంత్రాంగం



రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

నవతెలంగాణ-నవీపేట్

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ఆరబెట్టెందుకు రహదారులే దిక్కవుతున్నాయి. రాష్ట్రంలో 7వేల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ రైతు పంట కోసి ఆరబెట్టేందుకు స్థలం లేకపోవడంతో రోడ్లపైనే ఆరబెడుతున్నారు.. ఆరు నెలల క్రితమే భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు రహదారులపై ధాన్యం ఆరబెట్టొద్దని ప్రమాదాలు జరిగితే రైతులే బాధ్యత వహించాలని స్పష్టం చేసింది. దీంతో ప్రయాణికులకు ప్రమాదాలు ఏమైనా జరిగితే రైతులు జైలు పాలు కావడమే కాక ఆర్థిక నష్టాన్ని సైతం చవిచూడాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సుప్రీంకోర్టు ఆదేశించి ఆరు నెలలైనా ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు.


వివరాలు మెయిన్‌లో..

రోడ్డు ప్రమాదంలో పదోతరగతి విద్యార్థిని మృతి

- పరీక్ష రాసి వెళ్తుండగా.. బోల్తా పడ్డ ఆటో







ప్రమాదానికి కారణమైన ఆటో.. మృతిచెందిన విద్యార్థి హాల్‌టికెట్

నవతెలంగాణ-బిచ్కుంద

పదో తరగతి పరీక్ష రాసి అమ్మ, అమ్మమ్మతో కలిసి ఆటోలో వెళ్తుండగా ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడటంతో పదోతరగతి విద్యార్థిని మృతిచెందిన విషాదకర ఘటన బిచ్కుంద మండలం గోపన్‌పల్లి గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. బిచ్కుంద మండలంలోని గోపన్‌పల్లి గ్రామానికి చెందిన జుట్టుల శిరీష (14) మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాస్తుంది. సోమవారం పరీక్ష రాసిన అనంతరం గ్రామానికి తల్లి సాయవ్వ, అమ్మమ్మ ఈరవ్వతో కలిసి ఆటోలో వెళ్తుండగా.. ఆటో అతివేగంతో అజాగ్రత్తగా నడపడంతో బారెడు పోచమ్మ మందిరం వద్ద బోల్తా పడింది. దీంతో వీరి ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా హాజ్గుల్ గ్రామానికి చెందిన మందలక్ష్మి కి చెయ్యి విరిగిపోగా జగన్నాథ్, తులసవ్వ కు గాయాలయ్యాయి. ఆటోలో ప్రయాణిస్తున్న మరికొందరు ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఆ సమయంలో ఆటోలో పదిమంది ప్రయాణికులు ఉన్నారని ఆటో అతివేగంగా వెళ్లడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. క్షతగాత్రులను బాన్సువాడ ఆస్పత్రికి తరలించగా.. జుట్టుల శిరీష అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తలెఇపారు. ఘటన స్థలానికి ఎస్ఐ శ్రీధర్ రెడ్డి చేరుకొని తల్లి సాయవ్వ ఫిర్యాదు మేరకు డ్రైవర్ సంజీవ్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బాలిక కుటుంబంలో విషాదాఛాయలు

గత పది సంవత్సరాల క్రితం విద్యార్థిని శిరీష తండ్రి చనిపోగా కూలి పని చేస్తూ తల్లి సాయవ గోపనపల్లి గ్రామంలోని తన అమ్మ గారి ఇంట్లో ఉంటూ తన ఒక కూతురు శిరీషను చదివిస్తూ జీవనం కొనసాగిస్తుంది. ఉన్న ఒక్కగానొక్క కూతురు ఆటో ప్రమాదంలో చనిపోవడంతో వారి కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

టేకు పట్టివేత



నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని యావనంది అటవీ రేంజ్ పరిధిలో దాచి ఉంచిన 15 టేకు దుంగలు పట్టుకున్నట్లు డిప్యూటీ రేంజ్ అధికారి గంగారాం సోమవారం తెలిపారు వీటి విలువ 7వేల రూపాయలు ఉంటుందని, అక్రమంగా చెట్లను నరికితే కఠినమైన శిక్షలు విధిస్తామని ఆయన హెచ్చరించారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

- మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్

నవతెలంగాణ-ఆర్మూర్

కంటి వెలుగు రెండో విడత కార్యక్రమం 15,25 వార్డుల్లో కేంద్రాలను ప్రారంభించామని,18 సంవత్సరాలు పైబడిన వారినుండి వృద్ధుల వరకు కంటి సమస్య ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్ అన్నారు. కళ్లద్దాలు, సరిపడు మందులు, డ్రాప్స్ తీసుకొని కంటి సమస్యను పరిష్కరించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్స్ రేవతి గంగా మోహన్, గంగా మోహన్ చక్రు ,ఆరోగ్యశాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు, మహిళా సంఘాల ఆర్పీలు, వార్డు ఆఫీసర్లు, ప్రజలు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు డబుల్ ఇండ్లు ఇవ్వడం లేదు

నవతెలంగాణ-(బాల్కొండ) ఆర్మూర్

పేదవారి కేటాయించిన డబుల్ బెడ్ రూములు ఇల్లు పక్కదారి పడుతున్నాయని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ నాయకురాలు పిప్పెర లావణ్య అన్నారు. అర్హులైన పేదవారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించి లబ్ధిదారులకు అందజేయాలని సోమవారం మండలంలో ఇత్వార్ పేట్ గ్రామానికి చెందిన పేద ప్రజల తరపున తహసీల్దార్ కార్యాలయ ఆర్ఐ రాఘవేంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రతి పేదవాడికి డబుల్ బెడ్ రూమ్ ఇస్తామని చెప్పిన కేసీఆర్ బాల్కొండ నియోజకవర్గంలో ఎంతమందికి ఇచ్చారో చెప్పాలన్నారు. పేదవారు పూరి గుడిసెలో ఉంటే మంత్రి ప్రశాంత్ రెడ్డికి కనిపించడం లేదా.. అని ప్రశ్నించారు. డబుల్ బెడ్ రూమ్ ఇస్తున్నామని గొప్పగా చెప్పుకున్నా రాష్ట్ర ప్రభుత్వం. ఎంత మందికి ఇప్పటికీ డబుల్ బెడ్ రూమ్ ఇచ్చారో లెక్క చెప్పాలన్నారు. ఇప్పటికైనా అర్హులైన వారికి వెంటనే డబుల్ బెడ్ రూమ్ కేటాయించాలని డిమాండ్‌చేశారు. లేకుంటే పోరాటం తప్పదని చెప్పారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

ఆర్జీలను పరిశీలించి పరిష్కరించాలి

• ప్రజావాణికి 40 ఫిర్యాదులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 40 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు డీఆర్డీఓ చందర్, జెడ్పి సీఈఓ గోవింద్, నిజామాబాద్ ఆర్డీఓ రవి లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా ఆర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈత కొలను తొలగించొద్దు

ఈత కొలను తొలగించొద్దంటూ సోమవారం కలెక్టరేట్ కార్యాలయానికి ఈతకొలను పరిరక్షణ కమిటీ తరలివచ్చి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సుభాష్‌నగర్‌లోగల స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ స్థలాన్ని కూడా ఆఫీసర్ క్లబ్ కు అప్పగించ వద్దని అన్నారు. ఈ స్విమ్మింగ్ పూల్‌లో విద్యార్థులు, యువకులు, పెద్దలు అందరు ఈతకు వస్తున్నారని అన్నారు. విద్యార్థులు స్విమ్మింగ్ చేసి రాష్ట్ర,జాతీయస్థాయిలో పోటీలో పాల్గొని పతకాలు సాధించారని తెలిపారు. ఈ నెల ఒకటిన తహసీల్దార్, ఆర్డీఓ, సర్వేయర్, ఆఫీసర్స్ క్లబ్ సభ్యులు వచ్చి స్థలాన్ని కొలతలు చేశారని అన్నారు. స్విమ్మింగ్, స్కేటింగ్ స్థలం దగ్గరలో విద్యాసంస్థలు, దేవాలయం ఉందని, అటువంటి స్థలంలో ఆఫీసర్స్ క్లబ్ రావడంతో జూదం, మద్యం వంటి కార్యక్రమాలు నడిచే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఈతకొలను పరిరక్షణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు సమస్యలను విన్నవిస్తున్న ఫిర్యాదుదారులు

ప్రపంచ సైకియాట్రిక్ మహాసభలకు డాక్టర్ ఆకుల విశాల్‌కు ఆహ్వానం



నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రపంచ సైకియాట్రిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించు మహాసభలకు నిజామాబాద్ కు చెందిన ప్రముఖ న్యూరో సైకియాట్రిక్ డాక్టర్ విశాల్‌ను ఆహ్వానించారని సోమవారం తెలిపారు. ఈనెల 14 నుండి 16 వరకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కత్తా పట్టణంలో ప్రపంచ సైకియాట్రిక్ అసోసియేషన్ మహాసభలు నిర్వహించనున్నారు. ఈ సభలకు నిజామాబాద్ నాకు చెందిన ప్రముఖ న్యూరో సైకియాట్రిస్ట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆకుల విశాల్‌కు వక్తగా ఆహ్వానం అందింది. నేటి ఆధునిక యుగంలో ప్రపంచంలోని యువ వైద్యులకు అలాగే మెడికల్ విద్యార్థులకు అధునాతన వైద్య విధానం, నాయకత్వ లక్షణాలు అంశంపై డాక్టర్ విశాల్, తెలంగాణ రాష్ట్ర సైకియాట్రిక్ అధ్యక్షులు డాక్టర్ జార్జి రెడ్డి, డాక్టర్ మిస్బాహ్ నసిరాబాది, డాక్టర్ అరబిందో బ్రహ్మ, డాక్టర్ ఫణికాంత్ బృందంగా ప్రసంగాన్ని చేయనున్నారు. ఈ బృందానికి డాక్టర్ విశాల్ ఆకుల చైర్‌పర్సన్ గా వ్యవహరించనున్నారు.

పేరిణి, కూచిపూడి నృత్యోత్సవంలో విజయ్ విద్యార్థినులు



అవార్డులు, ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

పేరిణి, కూచిపూడి నృత్యోత్సవంలో విజయ్ విద్యార్థినులు అవార్డులు, ప్రశంసా పత్రాలను అందుకున్నారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ 10వ వార్షికోత్సవం సందర్భంగా ఏబీసీ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో రవీంద్రభారతి వేదికగా ఈ నెల 9న ఆదివారం నృత్యాలను ప్రదర్శించారని విజయ్ హై స్కూల్ కరస్పాండెంట్ ప్రభాదేవి సోమవారం తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి కళాకారులు ఈ నృత్యోత్సవంలో పాల్గొనగా సోలో విభాగంలో 6వ తరగతి చదివే డి. హరిణాక్షి పేరిణి లాస్యం, జి. సాయిష కూచిపూడి నృత్యాలను ప్రదర్శించి 'నవరస నాట్యకేళి' అవార్డును, ప్రశంసా పత్రాన్ని బహుమతిగా పొందారని తెలియజేశారు. అవార్డు సాధించిన బాలికలను పాఠశాల కార్యదర్శి డా. అమృతలత, కరస్పాండెంట్ వి. ప్రభాదేవి, అకడమిక్ డైరెక్టర్ టి.వసంత, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ పి.సుజాత, ప్రిన్సిపాల్ పి.విజేత అభినందించారు.

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మాక్ డ్రిల్



ఆస్పత్రిలో పరికరాల పనితీరును పరిశీలిస్తున్న సూపరింటెండెంట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మాక్ డ్రిల్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమ రాజ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు.ప్రపంచవ్యాప్తంగా మరో మారు కరోనా మహమ్మారి ప్రబలుతున్నదని రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల్లో ప్రభుత్వాసుపత్రుల్లో మౌలిక సదుపాయాలపై మాక్ డ్రిల్ నిర్వహించాలని సూచించింది. ఈ మేరకు జిల్లా ప్రభుత్వాసుపత్రి నిజామాబాద్‌లో మాక్ డ్రిల్ నిర్వహించామని తెలిపారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ ప్రతిమ రాజ్ మాట్లాడుతూ.. కోవిడ్ బాధితులకు 262 బెడ్స్ ఆక్సిజన్ సదుపాయంతో ఉన్నాయని, ఆసుపత్రిలోని ఆక్సిజన్ ప్లాంట్ పనితీరు, వార్డులలోని ఆక్సిజన్ పాయింట్స్ యొక్క పరిస్థితి, ఆక్సిజన్ సిలిండర్ల స్టాక్ పొజిషన్, వాటి సరఫరా గురించి తెలుసుకున్నామనీ అన్నారు. అలాగే ఎమర్జెన్సీ వార్డు పరిశీలించి అక్కడ బెడ్స్ పరిస్థితి, వెంటిలేటర్ల పనితీరు, బిఐపిపి పనితీరును అడిగి తెలుసుకున్నామని తెలిపారు. కోవిడ్ చికిత్సకు సంబంధించిన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ప్రజలంతా మాస్క్ ధరించాలని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వెలుగు వైద్యులకు సన్మానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ గ్రామంలో రెండో విడత కంటివెలుగు శిబిరం విజయవంతంగా పూర్తయినందుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కంటి వెలుగు వైద్య బృందం, సిబ్బందిని సర్పంచ్ బద్దం పద్మ చిన్నారెడ్డి సోమవారం ఘనంగా సన్మానించారు. కంటి వెలుగు బృందం కమ్మర్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరసింహస్వామి, కంటి వైద్యులు శివ, హెచ్‌ఈఓ మహేందర్, హెల్త్ సూపర్వైజర్ ఎస్తేర్, డిఏఓ అభినవ్, ఏఎన్ఎంలు అరుణ కుమారి, స్వరూప, ఎంఎల్‌హెచ్‌పి దివ్య, అంగన్వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలను శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ నరసింహస్వామి మాట్లాడుతూ... కంటి వెలుగు శిబిరం విజయవంతం అయ్యేందుకు సహకరించిన గ్రామస్తులకు ధన్యవాదాలు తెలిపారు. గ్రామంలో నెల రోజులపాటు నిర్వహించిన కంటి వెలుగు శిబిరంలో 2706 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, అందులో దగ్గరచూపు 224 మందికి అద్దాలు అందజేసినట్లు తెలిపారు. దూరపు చూపు అద్దాలు అవసరమైన 282 మందిలో ఇప్పటికే 165 మందికి అద్దాలను అందజేసినట్లు తెలిపారు. మిగిలిన వారికి త్వరలోనే అద్దాలను అందిస్తామన్నారు. మోతి బిందు కంటి ఆపరేషన్లు అవసరమైన 330 మందిని జిల్లా కేంద్ర ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్ రెడ్డి, మండల పరిషత్ కార్యాలయ సూపరిండెంట్ మైలారం గంగాధర్, ఈజీఎస్ ఏపీవో విద్యానంద్, పంచాయతీరాజ్ దివ్య, ఉప సర్పంచ్ నందగిరి రేఖ శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి నరేందర్, వార్డు సభ్యురాలు శాంత, అంగన్వాడి టీచర్లు శోభ, పద్మ సరిత, ఆశా కార్యకర్తలు రాధా, శాంత, వినీల, తిరుమల, శారద, పద్మ, తదితరులు పాల్గొన్నారు.



కంటివెలుగు బృందాన్ని సన్మానించిన సర్పంచ్

హెూమియోపతితో సులువుగా చికిత్స



నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

హెూమియోపతితో సులువుగా చికిత్స పొందవచ్చని డాక్టర్ లక్ష్మణ్ రావు అన్నారు. క్రిస్టియన్ ఫ్రెడరిక్ శామ్యూల్ హానెమాన్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ప్రభుత్వ హెూమియోపతి మెడికల్ కళాశాల లో డాక్టర్ కె.లక్ష్మణ్ రావు సోమవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తస్రావ నివారిణి పదార్థాలు మలేరియాకు వ్యతిరేకంగా ప్రభావవంతంగా లేవని హానెమాన్ నమ్మాడని తెలిపారు. స్వీయ-అనువర్తనం ద్వారా మానవ శరీరంపై సింకోనా ప్రభావాన్ని పరిశోధించడం ప్రారంభించారని, ఔషధం తనలో మలేరియా-వంటి లక్షణాలను ప్రేరేపించిందని తెలుసుకుని, ఆరోగ్యంగా ఉన్న ఏ వ్యక్తిలోనైనా అలా ఉంటుందని ఆయన తెలిపారన్నారు. దీంతో వైద్య సూత్రాన్ని ప్రతిపాదించడానికి దారితీసిందని, ఆరోగ్యకరమైన వ్యక్తిలో లక్షణాల సమితిని ఉత్పత్తి చేయగలదని, అదే విధమైన లక్షణాలను వ్యక్తపరిచే జబ్బుపడిన వ్యక్తికి చికిత్స చేయగలదని హెూమియోపతి అని పేరు పెట్టడానికి వైద్య విధానానికి ఆధారమైందని తెలిపారు. మొదట హెూమియోపతి అనే పదాన్ని 1807 సంవత్సరం లోనే హుఫెలాండ్స్ జర్నల్ లో ప్రచురించిన ఇండికేషన్స్ ఆఫ్ ది హెూమియోపతి, ఎంప్లాయ్‌మెంట్ ఆఫ్ మెడిసిన్స్ ఇన్ ఆర్డినరీ ప్రాక్టీస్ అనే వ్యాసంలో ఉపయోగించారని గుర్తుచేశారు.

ఫౌంటెన్ ఎదుట నిరసన

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపాలిటీ నడిబొడ్డున 10 లక్షల రూపాయలు పెట్టి నిర్మించిన ఫౌంటెన్ పని చేయక సంవత్సర కాలం గడుస్తున్నా పట్టించుకోవడంలేదని సోమవారం బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షులు జెస్సు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఫౌంటెన్ ఎదుట నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ బిజెపి ఫ్లోర్ లీడర్ జీవీ నరసింహారెడ్డి మాట్లాడుతూ.... పట్టణ అందం, అభివృద్ధి పేరుతో 10 లక్షలు పెట్టి ఫౌంటెన్ నిర్మాణం చేశారన్నారు. అక్రమంగా భూములను ఆక్రమించుకోవడం తప్ప అభివృద్ధి వైపు చూసిన దాఖలాలు లేవని విమర్శించారు. మున్సిపాలిటీ అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ గా మారిందన్నారు. క్రీడా మైదానాలను సైతం ఆక్రమించుకునే దుర్మార్గానికి తెరలేపుతున్నారని, ఇండోర్ స్టేడియంను పట్టించుకోవడంలేదని, నవనాథపురం అభివృద్ధి పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షులు నూతుల శ్రీనివాస్ రెడ్డి, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు విజయానంద్, పోల్కం వేణు, పట్టణ ఉపాధ్యక్షులు మీసాల రాజేశ్వర్, కార్యదర్శులు గుగులోత్ తిరుపతి నాయక్, పులి యుగంధర్, దళిత మోర్చ పట్టణ అధ్యక్షులు కౌన్సిలర్ బ్యావత్ సాయికుమార్, కార్యదర్శి కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

మాలల అస్తిత్వం, ఆత్మగౌరవం, అభివృద్ధే ప్రాథమిక లక్ష్యం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

మాలల అస్తిత్వం, ఆత్మగౌరవం, అభివృద్ధే అంసా ప్రాథమిక లక్ష్యం అని అంసా రాష్ట్ర అధ్యక్షుడు అంగరి ప్రదీప్ అన్నారు. మాల సామాజిక వర్గ అస్తిత్వం, ఆత్మ గౌరవం, అభివృద్ధి కొరకు నిరంతరం పాటుపడుతూ అణగారిన వర్గాలు కులాలతో కలిసి కులఅణిచివేత దోపిడి రాజకీయాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు నిర్మించాలనే మౌలికమైన తాత్విక పునాదులపై ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు. నేడు అంసా పదవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిజామాబాద్ నగరంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో అంసా పదవ వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ దళిత నాయకులు దండు చంద్రశేఖర్, మాలమహానాడు వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల నాగరాజు, సీసీ బ్యాంకు డైరెక్టర్, న్యాయవాది గోర్కంటి లింగన్న, సీనియర్ జర్నలిస్ట్ ఎడ్ల సంజీవ్ హాజరై అంబేద్కర్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. పది సంవత్సరాలుగా తెలుగు రాష్ట్రాల్లో అంసా నిర్వహించిన చైతన్య కార్యక్రమాలను తెలంగాణ పోరాటంలో అంసా పోరాడిన పోరాటపటిమను గుర్తు చేశారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు అంగరి ప్రదీప్ మాట్లాడుతూ.. మాల సామాజిక వర్గ విద్యార్థులు శ్రద్ధతో చదువుతూ పోరాడాలని, సామాజిక ఉద్యమా లకు నాయకత్వం వహించాలని అన్నారు. పది సంవత్సరాల అంసా పోరాట నేపథ్యాన్ని త్యాగాలను చరిత్రను పునర్ నిర్మించాల్సిన చారిత్రక అవసరం ఎంతైనా ఉన్నదని తెలిపారు. ఇందుకు ఈనెల 30న ఉస్మానియా యూని వర్సిటీలో మాలల మేధోమథన సభ సదస్సును నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో దళిత నాయకులు నాయుడు రాజు, ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం పూర్వాధ్యక్షులు అబ్బి ప్రగతి కుమార్, అంసా కార్యదర్శి తార్ల లక్ష్మణ్, సంతోష్ పాల్గొన్నారు.



వార్షికోత్సవంలో పాల్గొన్న హంసా నాయకులు

మహబూబ్ ఆలీ స్మారకార్థం క్రికెట్ టోర్నమెంట్



టోర్నమెంట్‌లో పాల్గొన్న యువకులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మొహమ్మద్ మహబూబ్ ఆలీ స్మారకార్థం తడపాకల్ గ్రామంలో సోమవారం గ్రామస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను వారి కుటుంబ సభ్యుడు రషీద్ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ పత్తిరెడ్డి ప్రకాష్ మాట్లాడుతూ... ఆటల వల్ల గ్రామాల్లోని యువతలో స్నేహ పూర్వకమైన వాతావరణం, పోటీతత్వం నెలకొంటుందని, దీనితో పాటు ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ గ్రామంలోని యువతను ఒకే చోట కలిపిందని, మెహబూబ్ కుటుంబానికి ధన్యవాదాలు అని అన్నారు. గ్రామంలోని యువకులు,పెద్దలు కలిసి క్రికెట్ ను తిలకించారు.

రేషన్ షాపుల్లో 12రకాల సరుకులు ఇవ్వాలి : పీవైఎల్

నవతెలంగాణ -ఆర్మూర్

12 రకాల సరుకులు ఇవ్వాలని, గ్యాస్ సబ్సిడీలు ఇవ్వాలని, నూతన రేషన్ కార్డులను ఇవ్వాలని ,తదితర డిమాండ్లతో ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) ఆధ్వర్యంలో పెర్కిట్ లో పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగాప్రగతిశీల యువజన సంఘ మండల కార్యదర్శి తూర్పాటి శ్రీనివాస్ మాట్లాడుతూ... రేషన్ షాపుల్లో 12 రకాల నిత్యావసర సరుకులు, అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేషన్‌షాపుల్లో ఐదు కేజీల బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ఐదు కేజీలు కేంద్ర ప్రభుత్వం 5 కేజీలు మొత్తం పది కేజీల నాణ్యమైన సన్న బియ్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు వంట నూనె, కందిపప్పు, పెసరపప్పు, గోధుమపిండి, పంచదార, టీ పొడి ,ఉప్పు ,పసుపు, కారం, చింతపండు, పల్లీలు, సర్ఫ్, సబ్బులు పంపిణీ చేయాలని వారు డిమాండ్ చేశారు. గ్యాస్ ధరలు విపరీతంగా పెంచి సబ్సిడీ కూడా ఎత్తివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను నిలువుదోపిడీచేసి నరేంద్ర మోడీ ఆదాని, అంబానీలకు ఈ దేశాన్ని కట్టబెడుతున్నారని అన్నారు. కార్పొరేట్ వ్యక్తులకు సబ్సిడీ ఇస్తున్నారని, పేదలకు రావాల్సిన రాయితీలను ఎత్తివేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మి, సుజాత, గంగమ్మ, నజీర్, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

కష్టజీవి పోరాట పాటలో కానూరి కనిపిస్తాడు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

కష్ట జీవి పోరాట పాటలో కానూరి వెంకటేశ్వరరావు కనిపిస్తాడని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసు అన్నారు. మండలకేంద్రంలో సోమవారం కానూరి తాత ఫోటోకు పూలమాలవేసి, ఐఎఫ్‌టీయూ, అరుణోదయ నాయకులు ఘన నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా దాసు మాట్లాడుతూ ప్రజా కళలకు ప్రాణం పోసిన కానూరి సాంస్కృతిక ఉద్యమంలో ఒక మైలురాయి అని ఆయన కొనియాడారు. కానూరి జనగానం, వ్యంగ్య రచనలు ప్రత్యేకమైనవని ఆయన తెలిపారు. ఎందరో కవులు, కళాకారులు కళా నైపుణ్యత కలిగినా కాసులకు అమ్ముడుపోయారని, కానూరి తాత కష్టజీవుల కోసం, రాజ్య హింసను ఎదుర్కొని శ్రమజీవుల పక్షమే నిలబడ్డాడని తెలిపారు. అనేకమంది ప్రజా గాయకులను, కళాకారులను తీర్చిదిద్దిన ఘనత కానూరి తాతది అని ఆయన తెలిపారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి. కాజా మొయినుద్దీన్ మాట్లాడుతూ... శ్రామిక జనుల శ్రమకు తగిన ఫలితం దక్కాలని, మెరుగైన సమాజం కావాలని, శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా తన కలాన్ని, స్వరాన్ని ఆయుధంగా మలిచిన కానూరి కష్టజీవుల పోరాట జండాల్లో చిరంజీవిగా నిలిచాడని ఆయన అన్నారు. కార్యక్రమములో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి జెపి గంగాధర్, సుంకరి శ్రీనివాస్, గంగాధర్, గోవర్ధన్, అరుణోదయ రంజిత్, శివ, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.



కానూరికి నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

జీపీ పాలకవర్గానికి సన్మానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

జాతీయ పంచాయతీ అవార్డ్స్‌లలో భాగంగా నిజామాబాద్ జిల్లా 9 థీమ్స్ లలో స్వయం సమృద్ధి మౌలిక సదుపాయాల కల్పనలో కమ్మర్‌పల్లి గ్రామ పంచాయతీ ప్రథమ బహుమతి సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. సోమవారం లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం సర్పంచ్ గడ్డం స్వామి, ఉప సర్పంచ్ పాలెపు చిన్న గంగారం, పంచాయతీ కార్యదర్శి శాంతి కుమార్‌లను సభ్యులు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు బద్దం రాజేష్ మాట్లాడుతూ జాతీయ ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డ్ ను అందుకున్న పంచాయతీ పాలకవర్గం సభ్యులకు గ్రామస్తుల తరపున అభినందనలు తెలిపారు.రానున్న రోజులలో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయాలనీ కోరారు. అనంతరం సర్పంచ్ గడ్డం స్వామి మాట్లాడుతూ ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డు సాధించడంలో సహకరించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి, గ్రామ స్థాయి అన్ని శాఖల అధికారులకు, పాలకవర్గ సభ్యులకు, గ్రామ పంచాయితీ సిబ్బందికి, గ్రామ అభివృద్ధి కమిటీకి గ్రామస్థులందరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ కోశాధికారి చిలువేరి భూమేశ్వర్, సభ్యులు నరసయ్య, ఆకోజీ అంకిత్, బిఆర్ఎస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గం సమన్వయ కమిటీ సభ్యుడు హైమద్ హుస్సేన్, బిఆర్ఎస్ రైతు విభాగం మండల అధ్యక్షుడు బద్దం రాజశేఖర్, నాగేష్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



జీపీ పాలకవర్గాన్ని సన్మానించిన గ్రామాభివృద్ధి కమిటీసభ్యులు

కోర్టు విధులు బహిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ బార్ అసోసియేషన్‌లో అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యుల సమక్షంలో జరిగిన సమావేశంలో జిల్లా కోర్టుకు సంబంధించిన ప్రముఖ సీనియర్ న్యాయవాది మాన్ మోహన్ రాజ్ మరణించినందున సోమవారం కోర్టు విధులను బహిష్కరించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సరసం చిన్న రెడ్డి, ఉపాధక్షుడు సెరియల జగన్, ప్రధాన కార్యదర్శి ఐనారి అశోక్, సంయుక్త కార్యదర్శి జైడి మదుసుదన్ రెడ్డి, ట్రెజరర్ అరుణ్ కుమార్. గ్రంథాలయ కార్యదర్శి తుమ్మ సుకేష్, మహిళా రిప్రజెంటేటివ్ సవిత చక్ర, సీనియర్ న్యాయవాదులు లోక భూపతిరెడ్డి, గంగారెడ్డి జగదీశ్వర్‌రెడ్డి, పండిత్, ఏలేటి గంగాధర్, చిల్క కిష్టయ్య, మురళీధర్, ఆవుల అశోక్, విజయలక్ష్మి, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



విధులు బహిష్కరించిన న్యాయవాదులు

హోటల్‌లో మద్యం సిట్టింగ్.. యజమానిపై కేసు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మద్యం తాగడానికి అనుమతించిన హెూటల్ యజమానిపై కేసు నమోదు చేసినట్టు ఎల్లారెడ్డి ఎస్ఐ గణేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి మండలంలోని శివనగర్ గేటు వద్ద ఓ హెూటల్‌లో మద్యం తాగుతున్నారన్న సమాచారం మేరకు హెూటల్ వద్దకు వెళ్లి చూడగా మద్యం తాగిన గ్లాసులను, మద్యం సీసాలను గుర్తించి తాగడానికి అనుమతించిన హెూటల్ యజమానిపై కేసు నమోదు చేశారు. ఎవరైనా హెూటల్ యజమానులు మద్యం తాగడానికి అనుమతిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి వ్యక్తికి తీవ్రగాయాలు



నవతెలంగాణ-పిట్లం

ఎక్సెల్ మోటర్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన ధర్మారం టోల్‌గేట్ సమీపంలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం జాతీయ రహదారి 161 ధర్మారం టోల్‌గేట్ సమీపంలో మండలంలోని నాగంపల్లి గ్రామానికి చెందిన ఇస్మాయిల్ ఎక్సెల్ మోటర్ అదుపుతప్పి కింద పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రుడిని పిట్లం ఆసుపత్రి తరలించగా.. వారు బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి రెఫర్ చేశారు.

గ్రామ పంచాయతీని మార్చాలని వినతి



వినతినిస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండలంలోని అడవి లింగాల తండాకు చెందిన గ్రామస్తులు జిల్లా పంచాయతీ అధికారికి సోమవారం కలిసి తమ తండాను అడివి లింగాల గ్రామపంచాయతీలో చేర్చాలని వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతనంగా గ్రామపం చాయతీలు ఏర్పడిన వ్పుడు తమ తాండను కొక్కొండలో కలవడం వల్ల తాము ఇబ్బందులకు గురవుతున్నామని, పంచాయతీలో పలు పనుల నిమిత్తం 3కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుందని గతంలో అడివి లింగాల 1/2 కిలోమీటర్లు మాత్రమే ఉండేదని, నూతన గ్రామపంచాయతీలో చేర్చినప్పటి నుంచి తండాలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని తెలిపారు. తమ తాండను తిరిగి అడివి లింగాల్‌లో కలపాలని, లేదా తమ తండానే గ్రామపంచాయతీగా ప్రకటించాలని కోరారు.

కంపోస్ట్ షెడ్లను వినియోగించాలి

- సేంద్రియ ఎరువులను తయారు చేయాలి
- అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

గ్రామాల్లోని కాంపోస్టు షెడ్ల వినియోగించి సేంద్రియ ఎరువులు తయారు చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో మండల స్థాయి అధికారులతో పల్లె ప్రగతి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సేంద్రియ ఎరువులను రైతులకు విక్రయించి పంచాయతీల సంపదను పెంపొందించుకోవాలని తెలిపారు. అన్ని గ్రామాల్లో 100శాతం ఇంటి పన్నుల వసూలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లోని వైకుంఠధామాలు వినియోగంలో ఉండే విధంగా చూడాలన్నారు. వైకుంఠధామాలలో విద్యుత్తు సౌకర్యం, నీటి వసతి కల్పించాలని చెప్పారు. వైకుంఠధామాల చుట్టు బయో ఫినిషింగ్ చేయాలని పేర్కొన్నారు. నర్సరీలను సంరక్షించాలని సూచించారు. వచ్చే హరితహారం కార్యక్రమానికి మొక్కలు ఏపుగా పెరిగే విధంగా చర్యలు చేపట్టాలని చెప్పారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలు ఏపుగా పెరిగే విధంగా వాటికి నీటిని అందించాలని పేర్కొన్నారు. సమావేశంలో డీపీఓ శ్రీనివాసరావు, డీఎల్పీఓలు సాయిబాబా, సురేందర్, శ్రీనివాస్, ఎంపీవోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

- టీపీసీసీ ఉపాధ్యక్షులు మదన్ మోహన్



పార్టీలో చేరిన పలువురు

నవతెలంగాణ-లింగంపేట్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ ఉపాధ్యక్షులు మదన్ మోహన్ అన్నారు. సోమవారం మండలంలోని పర్మల్ల, పర్మల్ల తండా నుంచి ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు టీపీసీసీ ఉపాధ్యక్షులు మదన్ మోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో సోమవారం చేరారు. ఈ సందర్భంగా మదన్ మోహన్ వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి వారిని పార్టీలోకి స్వాగతించారు. ముందస్తుగా జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద పని చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి కూలీల స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమం మండలాధ్యక్షులు నల్లమడుగు షరీఫ్, మాజీ సింగిల్ విండో వైస్ చైర్మన్ బుర్ర నారాగౌడ్, వార్డు సభ్యులు డాక్టర్ రాజు, మైనార్టీ సీనియర్ నాయకుడు రఫీ, యూత్ ఫోరం నాయకులు మహేష్‌గౌడ్, హర్షద్, సురేష్, నరేష్, రాజు, గంగారం, పర్మల్ల తండా గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సభ్యత్వ కార్డులు పంపిణీ

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని ధర్మారావుపేట్ గ్రామంలో కాంగ్రెస్ సభ్యత్వ కార్డులను సోమవారం పంపిణీ చేశారు. వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి ఆదేశాల మేరకు గ్రామంలో కాంగ్రెస్ సభ్యత్వ కార్డులు ఇంటింటికీ వెళ్లి పంచినట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు ఏనుగు బాల్‌రాజ్‌రెడ్డి, ఎండీ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

తూము శివమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న మున్సిపల్‌చైర్‌పర్సన్

నవతెలంగాణ-బోధన్

వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి తూము శివమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలో మున్సిపల్ చైర్మన్ తూము పద్మావతి చలి వేంద్రాన్ని సోమ వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ.. ఎండ వేడిమి నుంచి ప్రజలు ఉపశమనం పొందడానికి పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో, రాకాసిపేట్‌లో, లయన్స్ కంటి ఆసుపత్రి సమీపంలో చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్టు వివరించారు. కావున పట్టణ ప్రజలు చదివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శరత్‌రెడ్డి, చందు, కాంగ్రెస్ పార్టీ నాయకులు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ఘటన ఎల్లారెడ్డి పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి బస్ స్టాండ్ పక్కన ఫర్టిలైజర్ లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో స్తంభం విరిగి పక్కన ఉన్న దుకాణాలపై పడింది. సకాలంలో విద్యుత్ శాఖ అధికారులు స్పందించటంతో పెను ప్రమాదం తప్పింది.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని మల్లుపల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాలే రాములు సోమవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మరణించడంతో విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు రాములు కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, పెద్దమల్లారెడ్డి సొసైటీ చైర్మన్ రాజాగౌడ్, భిక్కనూర్ పట్టణ మాజీ సర్పంచ్ నాగభూషణంగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ భగవంతురెడ్డి, పెద్దమల్లారెడ్డి ఎంపీటీసీ సాయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న పలువురు

ఫ్లెక్సీల్లో ఫొటోలపై రగడ

- బోధన్ మున్సిపల్‌లో గ్రూప్ తగాదాలు
- ఎమ్మెల్యే ఫొటో లేదని బీఆర్ఎస్ నాయకుల అభ్యంతరం
- తామంటే లెక్కేలేదు : మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్



నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలో ఫ్లెక్సీల్లో ఫొటోలు వివాదం సృష్టించాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మావతి, ఆమె భర్త కౌన్సిలర్ శరత్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో ఎమ్మెల్యే ఫొటో లేదని బీఆర్ఎస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేయగా.. పలు కార్యక్రమాల సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఫొటో వేయడం లేదని పరస్పరం దూషించుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. బోధన్ పట్టణంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఆమె అత్తగారైన తూము శివమ్మ మెమోరియల్ ట్రస్ట్ పేరుతో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటి వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో సీఎం కేసీఆర్, కేటీఆర్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఫొటోలు ఉండడం, స్థానిక ఎమ్మెల్యే షకీల్ అమీర్ ఫొటో లేకపోవడంతో బీఆర్ఎస్ నాయకులు, కొంతమంది కౌన్సిలర్లు సోమవారం ఏఎంసి ఆవరణ ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అభ్యంతరం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్మన్ తూము పద్మావతి భర్త శరత్ రెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, స్థానిక ఎమ్మెల్యే సహకారంతో అధికారంలో వచ్చి ఆయన ఫొటో లేకుండా ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్నారని ఇది సమంజసం కాదని టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్ విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యేను అవమానించే విధంగా వ్యవహరించడం, ఫొటో లేకుండా ఫ్లెక్సీలు చేయడం చేయరాదన్నారు. ఒకవేళ వారి సొంత కార్యక్రమాలు అయితే ప్రభుత్వ పెద్దల ఫొటోలు లేకుండా కార్యక్రమాలు చేసుకుంటే తమకు అభ్యంతరం లేదన్నారు.

ఈ విషయమై మున్సిపల్ చైర్మన్ తూము పద్మావతి భర్త కౌన్సిలర్ శరత్ రెడ్డిని వివరణ కోరగా తన తల్లి గారి పేరుతో చేపట్టిన మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశామని, ఈ సందర్భంగా గత రెండు రోజుల క్రితం తాము పెట్టిన ఫ్లెక్సీలను ఎవరో తొలగించారని, మళ్ళీ సోమవారం యధావిధిగా ఫ్లెక్సీలతో నాలుగు చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రారంభించామని తెలిపారు. ఇది తమ సొంత సేవా కార్యక్రమమని తమ ఇష్టమున్న వారి ఫొటో పెట్టుకునే స్వేచ్ఛ తమకు ఉందని, ఎవరిని అడిగి పెట్టవలసిన అవసరం లేదని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఫొటో అట్టి ఫ్లెక్సీలో లేదని, తదనంతరం ఎమ్మెల్సీ కవిత పుట్టినరోజు సందర్భంగా తాను ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఎమ్మెల్యే ఫొటో వేయలేదని పేర్కొన్నారు. అంతేగాని వారు చేసిన తప్పులపై తనను బాధ్యులు చేయడం సరికాదన్నారు. ఈ విషయమై పట్టణ పోలీసులు కౌన్సిలర్ శరత్ రెడ్డిని పిలిపించి వివరణ కోరినట్లు ఆయన తెలిపారు. ఈ ఫ్లెక్సీల వివాదం చిలికి చిలికి గాలి వానలా వివాదాస్పదంగా మారడంతో ఏం జరుగుతుందోనని పట్టణవాసుల్లో ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం కొంతమంది కౌన్సిలర్లు గ్రూపులుగా విడిపోయినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఏదేమైనా బోధన పట్టణంలో బీఆర్ఎస్ పార్టీలో జరుగుతున్న ఈ వివాదాలు ఎటువైపు దారి తీస్తాయోనని పలువురు చర్చించుకుంటున్నారు.

ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

- శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు తక్షణమే పరిష్కరించాలని జిల్లా శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులకు పంపి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వచ్చిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఓ సాయన్న, ఏవో రవీందర్, ఎన్నికల పర్యవేక్షకుడు సాయి భుజంగరావు, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు. కాగా ప్రజావాణికి మొత్తం 58 ఫిర్యాదులు వచ్చాయి.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న శిక్షణ కలెక్టర్

రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి

నవతెలంగాణ-వర్ని(రుద్రూర్)

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల పక్షాన నిలబడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బాన్సువాడ నియోజకవర్గ ఇంచార్జి పోచారం సురేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం రుద్రూర్ మండలంలోని రాయకూర్ గ్రామంలో 17 డబుల్ బెడ్ రూమ్‌లకు సంబంధించిన స్థలంలో సర్పంచ్ అధ్యక్షతన భూమిపూజ చేశారు. అనంతరం రుద్రూర్ మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..



వరికొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పేద ప్రజలకు గూడు కల్పిస్తున్న ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని వివరించారు. స్పీకర్ కృషితో నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం చేపట్టి పేదవారికి అందజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నారోజీ గంగారం, ఎంపీపీ అక్కంపల్లి సుజాత నాగేందర్, సర్పంచ్ బేగరి గంగారం, ఖాదర్, పీఏసీఎస్ చైర్మన్ సంజురెడ్డి, తహసీల్దార్ ముజీబ్, కోఆప్షన్‌మెంబర్ మస్తాన్, అక్బర్‌నగర్ సర్పంచ్ గంగామని వరప్రసాద్, సర్పంచ్ భాగ్య భూషణం, ఏఎంసీ డైరెక్టర్లు, పీఎస్ఎస్ మెంబర్స్, పలు గ్రామాల కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ నిర్మాణాలకు భూమిపూజ

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ముస్తాపూర్ గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ నిర్మాణాలకు ఎంపీపీ గరీబున్నిసా నహీం, సర్పంచ్ మమతా వివేకానంద చేతుల మీదుగా సోమవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ పేదలకు డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించి ఇస్తున్నారన్నారు. ముస్తాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే జాజాల సురేందర్ సహకారంతో 5డబుల్ బెడ్ రూమ్‌లకు భూమిపూజ చేసినట్టు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మమత వివేకానంద, ఉపసర్పంచ్ లక్ష్మణ్‌గౌడ్, ఎంపీటీసీ భాగవ్వ సాయిలు, ఎంపీపీ గరీబున్ని నయీమ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బండి రాజయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దివిటి రమేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నెల్లూరి గంగ రామ్, రమేష్‌గౌడ్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సెక్రెటరీ సుబ్బారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, వార్డ్ మెంబర్లు సుమలత సంజీవులు, కాంతరెడ్డి, పద్మ చిన్న కాంతం, జూకంటి అనిత లక్ష్మణ్ రవి, గ్రామపెద్దలు సుధాకర్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, భూమయ్య, సాయగౌడ్, నీరడి పోచయ్య, వడ్ల కిష్టయ్య, చాకలి సాయిలు, మల్టీపర్పస్ వర్కర్లు నరేష్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న సర్పంచ్

ముస్లింలకు దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలోని షాదీఖానాలో 140 మంది మైనార్టీలకు రంజాన్ పండుగ సందర్భంగా దుస్తులను సోమవారం పంపిణీ చేశారు. పేదలకు రంజాన్ పండుగ సందర్భంగా ప్రభుత్వం ఉచితంగా బట్టలు అందజేస్తుందని, పండగను సంతోషంగా జరుపుకోవాలని సర్పంచ్ పత్తి లక్ష్మణ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సలీం, మార్కెట్ కమిటీ చైర్మన్ హమీద్, నాయకులు చోటామియా తదితరులు పాల్గొన్నారు.



రంజాన్ దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

గుంతను పూడ్చిన అధికారులు..

- నవతెలంగాణ వార్తకు స్పందన

నవతెలంగాణ-నసురుల్లాబాద్



గుంతను పూడ్చుతున్న సిబ్బంది

నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా జనసంచారం, ప్రయాణికులు రద్దీగా ఉండే ప్రాంతంలో పెద్ద గుంత ఏర్పడడంతో వాహనదారులకు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీంతో నవతెలంగాణ పత్రికలో నెల 7న 'ప్రమాదకరంగా గుంత' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆర్అండ్‌బీ అధికారులు స్పందించారు. సోమవారం బాన్సువాడ డివిజన్ ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి నసురుల్లాబాద్ బస్టాండ్ ఎదుట ఏర్పడిన గుంతలను పూడ్చివేశారు. ఎక్కడెక్కడ గుంతలు ఉన్నాయో పరిశీలించిన అధికారులు ఆయా ప్రాంతాలకు మొబైల్ వాహనాన్ని పంపించి సిబ్బందితో రోడ్లపై గుంతలను పూడ్చి వేయించారు. కొన్ని ప్రాంతాల్లో మరమ్మతులు అవసరం ఉన్నవాటిని సైతం పూర్తిచేశారు. దీంతో ప్రయాణికులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తూ, అధికారులను అభినందించారు.

జొన్నల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

- విండో చైర్మెన్‌ల వినతి



వినతినిస్తున్న విండో చైర్మన్లు

నవతెలంగాణ-పిట్లం

రబీ సీజన్‌కు గానూ రైతులు పండించిన జొన్న పంటలు కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ఉమ్మడి జిల్లా మార్క్‌ఫెడ్ డీఎం రంజిత్‌రెడ్డికి డీసీసీబీ డైరెక్టర్ సాయిరెడ్డి ఆధ్వర్యంలో సింగిల్ విండో చైర్మన్లు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ యేడు అకాల వర్షాలు మెండుగా ఉన్నందున రైతుల లబ్ది కోసం కొనుగోలు చేపట్టాలని, అకాల వర్షాలకు గాను జొన్న పంట తడిసి ముద్దయిపోవడం, చివరికి రంగు మారడం వల్ల రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని వారు పేర్కొన్నారు. సింగిల్ విండోల ద్వారా జొన్న పంట కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని వారు కోరారు. ఆయన వెంట చిన్నకొడప్‌గల్ చైర్మన్ నారాయణరెడ్డి, కారేగావ్ చైర్మెన్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగి.. పార్టీలకు వత్తాసా?

నవతెలంగాణ-రామారెడ్డి

ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండి, ప్రత్యక్షంగా రాజకీయ పార్టీలకు వత్తాసు పలుకుతున్న దృశ్యం సోషల్ మీడియాతో పాటు, న్యూస్ పేపర్లో రావడం చర్చనీయాంశంగా మారింది. శనివారం ఎల్లారెడ్డి నియోజకవర్గ కేంద్రంలో వైఎస్సార్ టీపీ తలపెట్టిన ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని నాయకురాలు జమున రాథోడ్ ర్యాలీ, ధర్నా నిర్వహించడంతో కార్యక్రమంలో రామారెడ్డి మండలానికి చెందిన వీఆర్ఏ పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై తహసీల్దార్ ఆనందును వివరణ కోరగా.. విచారణ చేపట్టి, వాస్తవాలు వెలుగులోకి వస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భూమి చూపే వరకూ ఉద్యమిస్తాం

- 15వ రోజుకు రిలే నిరాహార దీక్ష



ధర్నా చేస్తున్న బాధితులు, నాయకులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

తమకు భూమి చూపే వరకూ ఉద్యమిస్తామని మండలంలోని నెమ్లి గ్రామానికి చెందిన రైతులు, భార్య పిల్లలతో కలిసి నసురుల్లాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్ష సోమవారానికి 15వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షకు బాన్సువాడ సీపీఐ(ఎం) నాయకులు జె.రవీందర్ ఆధ్వర్యంలో చేపట్టగా.. వివిధ సంఘాల నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. నెమ్లి శివారులో గల భూమిని గత కొన్నేండ్ల క్రితం బతుకు దెరువు కోసం వేరే ప్రాంతానికి వెళ్లగా, ప్రభుత్వం 17 మంది మత్స్యకారులకు వ్యవసాయం కోసం సాగు చేసుకోవాలని ఇచ్చిందన్నారు. తమ భూములను సర్వే చేసి భూములను చూపించాలని కోరారు. 40 ఏండ్ల క్రితమే పట్టాలిచ్చారని, 2 ఎకరాల 20 గుంటల భూమికి నలుగురికి పట్టాలున్నాయన్నారు. గతంలో వ్యవసాయ రుణాలు సైతం పొందామన్నారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాడుతూనే ఉంటామన్నారు.

ఆలయ అభివృద్ధికి భక్తుల విరాళం


దాతలను సన్మానిస్తున్న ఆలయ సిబ్బంది

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణంలోని దక్షిణ కాశీ శ్రీ సిద్ద రామేశ్వర ఆలయ అభివృద్ధికి మెదక్ జిల్లా రామయంపేట్ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన మెతుకు సిద్దరాములు ధనలక్ష్మి దంపతులు ఆలయంలో గదుల నిర్మాణం కొరకు రూ.51వేల విరాళాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ అందె మహేందర్‌రెడ్డి విరాళం అందచేసిన దంపతులను శాలువాతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రాజేశ్వర శర్మ, నాయకులు రాజయ్య, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత


సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రానికి చెందిన గంగుశెట్టి హనుమాన్లు అనే లబ్దిదారునికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును సర్పంచ్ సురేష్ పంచాయతీ కార్యాలయంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ప్రజల ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ విట్టల్, వార్డు సభ్యులు బలరాం, రైతు సమన్వయ సమితి గ్రామ అధ్యక్షులు కంచిన్‌వార్ హనుమాన్లు తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి విద్యుత్ ఉద్యోగులు తరలిరండి


బహిరంగ సమావేశం పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

సన్నాహక సమావేశానికి విద్యుత్ ఉద్యోగులు తరలిరావాలని జిల్లా టీఎస్పీ జేఏసీ చైర్మన్ రఘునందన్ అన్నారు. ఈనెల 17 నుంచి జరగబోయే సమ్మెకు సన్నాహక సమావేశం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల బహిరంగ సమావేశం పోస్టర్ సోమవారం ఆవిష్కరించారు. మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకి హైదరాబాద్ రోడ్డులోని పిహెచ్ఆర్ కన్వెన్షన్ ధర్మారం గ్రామంలో నిర్వహిస్తున్నామని అన్నారు. దీనికి విద్యుత్తు ఇంజనీర్లు, ఉద్యోగులు, అకౌంట్ ఆఫీసర్స్, కార్మికులు, ఆర్టిజన్స్‌కు ప్రతి ఒక్కరు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా టీఎస్పీ జేఏసీ చైర్మన్ రఘునందన్ మాట్లాడుతూ.. ఈ సమావేశానికి రాష్ట్ర జేఏసీ నాయకులు, కంపెనీ జేఏసీ నాయకులు విచ్చేస్తున్నారని తెలిపారు. ఈనెల 17 నుంచి తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సమస్యలో వేతన సవరణ 2022, ఈపీఎఫ్ టు జీపీఎఫ్ (1999-2004) కు మార్చాలని, ఆర్టిజన్ల సమస్యలు, ఇతర సమస్యల సాధనకై సమ్మె నోటీసు అందజేయడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ బాలేష్ కుమార్ కో చైర్మన్ పీ.గంగాధర్, కో కన్వీనర్ తోట రాజశేఖర్ జేఏసీ నాయకులు జీ.శ్రీనివాస్, ఏ.కాశీనాథ్, గంగారాం నాయక్, సురేష్ కుమార్, నాంపల్లి, శివ కుమార్, రాజేందర్, నాగరాజ్ ,సతీష్, దుర్గాప్రసాద్, రాజేందర్, భూమేష్ ,ఎండీ యూనిస్, మహమ్మద్ అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షకు 78 మంది గైర్హాజరు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎస్ఎస్‌సి పబ్లిక్ ఎగ్జామ్స్ ఏప్రిల్ మూడో తేదీన ప్రారంభం కాగా 5 వ రోజు పరీక్షలో రెగ్యులర్ విద్యార్థులు, ప్రైవేట్ విద్యార్థులు కలిపి 78 మంది గైర్హాజరైనట్లు, రెండు మాల్ ప్రాక్టీసింగ్ కేసులు నమోదు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం కేంద్రాలు 138, మొత్తం అభ్యర్థులు రెగ్యులర్ ప్రైవేట్ కలుపుకొని 21,705 మంది అభ్యర్థులు పరీక్ష రాయల్సి ఉండగా 21627 మంది పరీక్ష రాశారని, 78 హాజరుకాలేదని పేర్కొన్నారు. జిల్లా ఎడ్యుకేషనల్ అధికారి ఎన్ దుర్గాప్రసాద్ 10 కేంద్రాలను తనిఖీలు చేశారు. డిస్టిక్ లెవెల్ అబ్జర్వర్ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్స్ 52 పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ తెలిపారు.

సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల ఆర్మూర్ రోడ్డులోని పృథ్వి అపార్ట్మెంట్‌వద్ద సీసీ రోడ్డు పనులకు సోమవారం భూమిపూజ చేశారు. సీడీపీ నిధులతో 16 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు వేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్, కార్పొరేటర్ మీసాల సవిత, పృథ్వి అపార్ట్మెంట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల 27 మంది భాధితులకి 13,18,100రూపాయల సీఎంఆర్ఎఫ్- ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ మొదటి కర్తవ్యం అని తెలిపారు. సీఎంఆర్ఎఫ్‌తో మెరుగైన వైద్యం అందుతుందన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్ ,నుడ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి బిఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మకమలం



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని ఎం జి కళ్యాణ మండపం యజమాని ఎం.జి అరవింద్ ఇంట్లో బ్రహ్మకమలం ఆదివారం వికసించింది. చెట్టుకు 12 సంవత్సరాలకు ఒక్కసారే పూసే ఈ కమలం పూస్తుందని తెలిపారు. బ్రహ్మ కమలంను చూడదానికి తెలిసినవారు తరలివస్తున్నారు.

ముగిసిన తైబజార్ వేలం పాట

నవతెలంగాణ-ముప్కాల్

బాల్కొండ గ్రామపంచాయతీలో వారసంత తైబజార్ వేలం పాటను సోమవారం సర్పంచ్ భూస సునీత అధ్యక్షతన నిర్వహించారు. మహమ్మద్ షఫీ అనే గుత్తేదారు రూ. నాలుగు లక్షల యాభై రెండు వేల రూపాయలకు వేలం పాట ద్వారా దక్కించుకున్నట్టు పంచాయతీ కార్యదర్శి రజినీకాంత్ రెడ్డి తెలిపారు. ఈవిషయాన్ని గ్రామస్తులు గ్రహించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ భూస సునీత, ఉప సర్పంచ్ షేక్ వహాబ్, పంచాయతీ కార్యదర్శి రజినీకాంత్ రెడ్డి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పీఎంపీ అసోసియేషన్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక


ఎన్నికైన పీఎంపీ అసోషిచేషన్ కమిటీ సభ్యులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

పీఎంపి అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ నిజామాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశం టీఎన్జీఓ భవన్‌లో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారులు, జిల్లా కార్యవర్గ సభ్యులు సుమారు 50మంది వరకు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాత బాడిని కొనసాగించాలని అందరి సమక్షంలో నిర్ణయించారు. అధ్యక్షులుగా పులగం మోహన్, ఉపాధ్యక్షులుగా లక్ష్మీ రాజ్యం, రవి వర్మ, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసు, కోశాధికారిగా పోశాద్రి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇతర పదవులకు త్వరలోనే ప్రకటిస్తామని జిల్లా అధ్యక్షుడు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి భక్తుల విరాళం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ పున్హనిర్మాణం కొరకు తిప్పాపూర్ గ్రామానికి చెందిన మన్నె దెవెందర్‌రెడ్డి ఆలయ అభివృద్ధికి రూ.10వేలు విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ సిద్దరాములకు అందజేశారు. ఈ సందర్భంగా విరాళం అందజేసిన దేవేందర్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షులు సాయిరెడ్డి, ధర్మకర్తలు రాజసింహారెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీలకు అండగా ప్రభుత్వం

ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బైండ్ల పోచన్న

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బైండ్ల పోచన్న ఆధ్వర్యంలో పల్లెపల్లెకూ ఓబీసీ.. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ బీజేపీ ఓబీసీల కోసం చేసిన పనుల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో దళిత మోర్చా ఎస్సీ సెల్ కోకన్వీనర్ బత్తిని దేవేందర్, ఓబీసీ జిల్లా అధ్యక్షులు మహారాజుల మురళి తదితరులు పాల్గొన్నారు.

12న శ్రీ వెంకటేశ్వరస్వామి ఉత్సవాలు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల సమీపంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఉత్సవాలను ఈనెల 12వ తేదీన బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఉత్సవాలకు మండలం నుంచే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు తరలిరావాలని, భక్తుల కోసం ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్టు వివరించారు.

గంగసాని స్వామిరెడ్డికి సన్మానం


స్వామిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-సదాశివనగర్

ఆయుష్మాన్ భారత్ పథకంలో అర్హులైన 6000 మందిని సభ్యులుగా చేయడానికి నిరంతరం కృషిచేసిన గంగసాని స్వామిరెడ్డిని సన్మానించారు. నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్‌లో చేరడం వలన ఆరోగ్యంగా ఇబ్బంది ఉన్నవారికి రూ.5లక్షల వరకు ఫ్రీగా ట్రీట్‌మెంట్ ఇవ్వనున్నట్టు వివరించారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు విట్టల్, గంగాధర్‌రావు, ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ శివారులో తలమడ్ల గ్రామానికి చెందిన యువకుడు వ్యవసాయ బావి వద్ద ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై ఆనంద్ గౌడ్ వివరాల ప్రకారం.. తలమడ్ల గ్రామానికి చెందిన సావుసాని లింగం (32)కు వచ్చేనెల 4వ తేదీన వివాహం జరగాల్సి ఉంది. లింగం గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. పెండ్లికూతురు కుటుంబానికి కడుపునొప్పి విషయం తెలిసి పెండ్లి క్యాన్సిల్ చేసుకుంటారని బాధతో, జీవితంపై విరక్తి చెంది భిక్కనూర్ శివారులో ఉన్న వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సదాశివనగర్ వజ్జేపల్లి గ్రామానికి చెందిన 22 మంది కాంగ్రెస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలో సోమవారం చేరారు. వీరికి స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే జాజాల సురేందర్ మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి నియోజకవర్గ, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి పార్టీలో చేరారని తెలిపారు. ప్రతి ఒక్క కార్యకర్తకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని తెలిపారు.

బీఆర్ఎస్‌లో చేరిక


బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు

నవతెలంగాణ-సదాశివనగర్

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఎమ్మెల్యే జాజాల సురేందర్ చేస్తున్న అభివృద్ధి పనులను చూసి మండలంలోని వజ్జేపల్లి గ్రామానికి చెందిన 22 మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొలిపెల్లి మహేందర్‌రెడ్డి, సర్పంచ్ ఎర్రం నర్సయ్య, ఉపసర్పంచ్ ప్రభాకర్, నాయకులు శీను నాయక్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కంటి చూపుతోనే ప్రపంచాన్ని చూడగలుగుతాం

వైద్యాధికారి రాజ్‌కుమార్

నవతెలంగాణ-ఎడపల్లి

కంటి చూపుతోనే ప్రపంచాన్ని చూడగలుగుతామని ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని బాపునగర్ గ్రామపంచాయతీలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన సందర్శించారు. రోజువారీగా ఎంతమంది కేంద్రానికి వస్తున్నారని కంటి వెలుగు వైద్య సిబ్బందితోపాటు ఆశావర్కర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరి పేరు నమోదును రికార్డులు చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎడపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రాజ్‌కుమార్‌తో పాటు కంటి వెలుగు వైద్యులు శ్రీకాంత్, ప్రశాంత్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది రేఖ దేవకర్ణ, ఆశావర్కర్లు లక్ష్మీ రంగమ్మ, లతా, కవిత, విజయలక్ష్మి, శైలజ, గ్రామపంచాయతీ కార్యదర్శి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వడ్డెపల్లి గ్రామంలో..

మండలంలోని వడ్డేపల్లి గ్రామంలోని గ్రామపంచాయతీ ఆవరణలో ఎడపల్లి ఎంపీపీ కె.శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ కూరెళ్ళ శ్రీధర్‌రెడ్డి కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. కంటి చూపుతో ఇబ్బందులు పడుతున్న ప్రతి ఒక్కరూ శిబిరానికి చేరుకొని కంటి వైద్యులచే కంటి పరీక్షలు నిర్వహించుకున్న అనంతరం ఉచితంగా అద్దాలను తీసుకోవాలని వారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు వనజా నాగరాజు, ఉపసర్పంచ్ విజయలక్ష్మి సత్యం, అంగన్వాడీ ఉపాధ్యాయులు దేవకుమారి, మైనావతి, ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది సరిత, ఆశావర్కర్లు, మాజీ ఉపసర్పంచ్, ప్రస్తుత పంచాయతీ కోఆప్షన్ సభ్యులు ఆంజనేయులు, కంటి వెలుగు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువత సేవ చేయడం అభినందనీయం

- **నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**

నవతెలంగాణ-కంఠేశ్వర్


అన్నరథం వాహనాన్ని ప్రారంభించిన కలెక్టర్

యువత స్వచ్ఛంద సేవ చేయడం అభినందనీయమని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అన్నారు. నిరంతరం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి సంబంధించి ఆకలి తీర్చే అన్నరథం వాహనాన్ని ప్రారంభించారు. ఇందూరు యువత సేవలను కొనియాడారు. ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఆకలి తీర్చే అన్నరథం వాహనాన్ని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయాన్ని సందర్శించారు. ఎవరు చేయలేని సేవ ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ముందుండి చేయడం గొప్ప విషయమన్నారు. ఆనాథలకు, విధివంచితులకు అండగా నిలుస్తు మానవత్వంతో సేవ చేస్తున్న వీరు ప్రతి ఒక్కరికి ఆదర్శం అని కొనియాడారు. ఇలాంటి సేవాకార్యక్రమాలకి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్, ఇందూరు క్యాన్సర్ ఆస్పత్రి డాక్టర్ ప్రద్యుమ్న, సంస్థ గౌరవ సలహాదారులు రామేశ్వర్ రెడ్డి, చిటిమిల్ల హరిప్రసాద్, సంజీవన్ రావ్, కాసర్ల నరేష్ రావు, దారం గంగాధర్, డాక్టర్ త్రివేణి, క సాయి తేజ,సుభాష్, వినయ్, బాలకిషన్, సుజాత, సంస్థ ప్రతినిధులు, మండలాల ఇంచార్జులు పాల్గొన్నారు.

జయంతి ఉత్సవాల కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా నాంపల్లి నియామకం


నాంపల్లిని సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీ 2023 రాష్ట్ర కన్వీనర్‌గా రేణిగుంట నాంపల్లిని నియమిస్తూ జయంతి ఉత్సవాల రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ మేడి పాపయ్య, సాంఘిక సంక్షేమ శాఖ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రత్యేక రాష్ట్రాల కోసం ఆర్టికల్ 3 రాజ్యాంగంలో పొందుపరచడం జరిగిందన్నారు. అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని భారతదేశంలో ఎక్కడలేని విధంగా ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు హైదరాబాద్‌లో నిర్మించి ఏప్రిల్ 14న ప్రారంభించబోతున్నారని, సెక్రటేరియట్‌కు కూడా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేరు పెట్టడం చాలా సంతోషమని ఎమ్మార్పీఎస్ టీఎస్ పక్షాన ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావుకు, మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు ధన్యవాదాలు తెలుపుతు న్నానని అన్నారు. తనను జయంతి ఉత్సవాల కమిటీకి రాష్ట్ర కన్వీనర్‌గా నియమించినందుకు ఉత్సవాలు కమిటీ చైర్మన్ మేడి పాపయ్య, మంత్రి కొప్పుల ఈశ్వర్, సాంఘిక సంక్షేమ శాఖ వారికి ధన్యవాదాలు తెలిపారు. . ఈ సందర్భంగా ఆర్ అండ్ బి అతిథి గృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సలంద్ర బాబురావు, రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షులు పోసాని, జిల్లా ఇంచార్జ్ సల్లూరి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు గుండారం మోహన్, మాదిగ మహిళ అధ్యక్షురాలు లత, నగర అధ్యక్షులు సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షులు మల్లేష్, సహాయ కార్యదర్శి సాయి బాబా, నగర అధ్యక్షురాలు మహేశ్వరి, లోలం భూమన్న, జాంబాద్ మండల అధ్యక్షులు తెడ్డు సాయిలు, గుండారం బాబయ్య నడిపి సాయిలు సెకండ్ డివిజన్ సలహాదారు మోరె శ్రీనివాస్, సెకండ్ డివిజన్ ఇంచార్జ్ సల్లూరి శంకర్, గాంధీనగర్ యూత్ ప్రెసిడెంట్ మోరె రాజేశ్వర్, తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

యువతకు గొప్ప వరం న్యాక్ సెంటర్ మంజూరు


పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-మోర్తాడ్

స్థానిక మండలానికి న్యాక్ పర్మినెంట్ సెంటర్‌ను మంజూరు చేయడం ఎంతో గర్వకారణమని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. సెంటర్ మంజూరుకు ఐదు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించడంతో మండల నాయకులు సీఎం కేసీఆర్, మంత్రి ప్రశాంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. రాష్ట్రంలో రెండు సెంటర్లకు నిధులు మంజూరు కాగా ఒకటి సిరిసిల్ల మరో ఒకటి బాల్కొండ నియోజకవర్గంలోని మోర్తాడ్‌కు మంజూరైనట్లు తెలిపారు. ఈ సెంటర్ మంజూరుతో ఇక్కడ చదువుతున్న నిరుద్యోగ యువతకు స్కిల్ డెవలప్మెంట్ ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని అన్నారు. న్యాక్ సెంటర్ మంజూరుకు కృషి చేసిన మంత్రి ప్రశాంత్ రెడ్డికి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'నైన్ స్టార్ హెల్త్ కేర్ హాస్పిటల్' ప్రారంభం

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని అంకాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త నైన్ స్టార్ సంస్థల అధినేత పైడి రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పడిన పైడి రాకేష్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో

నైన్ స్టార్ హెల్త్ కేర్ , జీజీ చారిటీ హాస్పిటల్స్ సంయుక్తంగా హైదరాబాద్‌లో హెల్త్‌కేర్ హాస్పిటల్ ఏర్పాటు చేశారు. నేడు హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లిలో ఒక్క రూపాయికే డాక్టర్ కాన్సల్టేషన్‌ను ఫీజుతో ప్రారంభించడం జరుగుతుందని ఫౌండేషన్ డైరెక్టర్ పైడి సుచరిత రెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా సుచరిత రెడ్డి మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా సేవ చేయాలని దృఢ సంకల్పంతో పైడి రాకేష్ రెడ్డి ఫౌండేషన్ ఏర్పాటు చేశామని తెలిపారు. పేదవారు ఎవరు కూడా వైద్యం కోసం అప్పులు చేయడం లేదా డబ్బులు లేక ప్రాణాలు కోల్పోవడం వంటివి జరుగకూడదని ఉచితంగా వైద్యం చేయడం కోసం ఈ ఫౌండేషన్ ఏర్పాటు చేయడం జరిగింది అని తెలిపారు. ఈ ఆసుపత్రి కోసం ఉచితంగా భవనం ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ ఆసుపత్రిలో ముఖ్యంగా ఎముకల వైద్యులు, కిడ్నీ, మూత్ర సంబంధిత వైద్యులు, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ వైద్యులు, చిన్నపిల్లలు, స్త్రీ లకు సంబంధించిన వ్యాధుల వైద్యులు ఇలా వివిధ రకాల వైద్యులు అందుబాటులో ఉంటారని అన్నారు.

బాధిత కుటుంబానికి ప్రభుత్వ విప్ చేయూత


ఆర్థికసాయం అందజేస్తున్న ఎంపీపీ, తదితరులు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మల్లేశం ఇల్లు కాలిపోయిన విషయం తెలిసింది. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సోమవారం బాధిత కుటుంబానికి తక్షణ సహాయార్థం రూ.15 వేలు పంపించి, ప్రభుత్వం తరపున ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ గాల్‌రెడ్డి, పట్టణ సర్పంచ్ తునికి వేణు, ఉప సర్పంచ్ బొడ నరేష్, ఆత్మ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, ఏఎంసీ చైర్మన్ భగవంతురెడ్డి, ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ అందే మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అంబల్ల మల్లేశం, మాజీ సర్పంచ్ నాగభూషణంగౌడ్, నాయకులు బోండ్ల రామచంద్రం, నర్సర్ సింగ్ పాల్గొన్నారు.